వక్ఫ్ బోర్డు పేరుతో రిజిస్ట్రేషన్లు ఆపొద్దు

ఎమ్మెల్యే వివేకానంద్‌గౌడ్

కుత్బుల్లాపూర్: వక్ఫ్ బోర్డు పేరుతో రిజిస్ట్రేషన్ల ప్రక్రియను ఆపడం సరికాదని, ప్రజలకు ఇబ్బందులు కలుగకుండా ప్రక్రియను వెంటనే ప్రారంభించాలని ఎమ్మెల్యే వివేకానంద్ అన్నారు. మంగళవారం పేట్‌బషీరాబాద్‌లోని క్యాంప్ కార్యాలయంలో కుత్బుల్లాపూర్ సబ్ రిజిస్ట్రార్ అశోక్, పద్మానగర్ ఫేజ్-2, గణేష్‌నగర్ కాలనీ సంఘాల ప్రతినిధులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గతంలో ఎన్నడూ లేని విధంగా నియోజకవర్గంలో వక్ఫ్‌బోర్డు భూముల పేరిట రిజిస్ట్రేషన్లను నిలిపివేయడం ఎంత వరకు సమంజసమని ప్రశ్నించారు. సర్వే నెంబర్ 171లోని 55 కాలనీలలో ఏళ్ల తరబడి నివసిస్తున్న పేద, మధ్య తరగతి ప్రజలు అవసరాల కోసం ఆస్తి విక్రయాలు చేపట్టకుండా ఉత్తర్వులు జారీ చేయడంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. ఇప్పటికే పలుమార్లు స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ శాఖ ఐజీ బుద్ధ ప్రసాద్ కార్యాలయంలో కలిసి ఇబ్బందులను వివరించినట్లు తెలిపారు. మరో రెండు రోజుల్లో రిజిస్ట్రేషన్ల ప్రక్రియను పునః ప్రారంభించేలా ఉత్తర్వులు జారీ చేస్తామని ఆయన హామీ ఇచ్చినట్లు సంక్షేమ సంఘాల ప్రతినిధులకు ఎమ్మెల్యే వివరించారు. సమావేశంలో పద్మానగర్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు సత్తిరెడ్డి, గణేష్ నగర్ సంక్షేమ సంఘం సభ్యులు దుర్గారావు, కాలనీల ప్రజలు పాల్గొన్నారు.



సబ్ రిజిస్ట్రార్, సంక్షేమ సంఘాల ప్రతినిధులతో సమావేశమైన ఎమ్మెల్యే వివేకానంద్

బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి

రంగారెడ్డినగర్: బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతికి కృషి చేసిన మహనీయుడు కేఎం పాండు అని వక్తలు కొనియాడారు. మంగళవారం మున్సిపల్ మాజీ చైర్మన్ కేఎం పాండు 6వ వర్ధంతి సందర్భంగా చింతల్ ప్రధాన రహదారిలోని పాండు మార్గ్‌లో ఉన్న ఆయన విగ్రహానికి ప్రజా ప్రతినిధులు, సంక్షేమ సంఘాల ప్రతినిధులతో కలిసి ఎమ్మెల్యే పూలమాలేసి నివాళులర్పించారు. కుల, మత, ప్రాంతాలకతీతంగా జాతీయ సమైక్యత, దేశ రక్షణ కోసం 1965లోనే జాతీయ రక్షణ నిధికి విరాళాలను అందించిన మహా నేత పాండు అని గుర్తు చేశారు. కార్మిక నాయకుడిగా కార్మిక, కర్షక వర్గాల పక్షాన సేవిల్లా నగరంలో జరిగిన మహాసభలకు హాజరై కార్మికుల బాధలను ప్రపంచానికి చాటిన కార్మిక పక్షపాతి అన్నారు. ఎంతో మంది నాయకులకు రాజకీయ ఓనమాలు నేర్పించారని స్మరించుకున్నారు.



పాండు విగ్రహం వద్ద నివాళి అర్పిస్తున్న ఎమ్మెల్యే వివేకానంద్ తదితరులు

భక్తిశ్రద్ధలతో నాగుల చవితి పూజలు

సుభాష్‌నగర్: నాగుల చవితి పర్వదినాన్ని మంగళవారం కుత్బుల్లాపూర్ నియోజకవర్గం పరిధిలో ఘనంగా జరుపుకున్నారు. ఉదయం నుండే భక్తులు నాగదేవత ఆలయాలకు క్యూ కట్టారు. పలు ప్రాంతాల్లో ఉన్న పుట్టల్లో పాలు పోసి నైవేద్యాలు సమర్పించారు. సాంప్రదాయ దుస్తులు ధరించి కుటుంబ సమేతంగా ఈ వేడుకల్లో పాల్గొన్నారు.



పూజలు చేస్తున్న భక్తులు



సూరారం ఉమామహేశ్వర ఆలయంలో నాగుల చవితి సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహిస్తూ..



గాజులరామారంలో పుట్టలో పాలు పోస్తూ..

స్థిరపడేందుకు వృత్తి విద్యా కోర్సులు దోహదం



అవగాహన కల్పిస్తున్న డిప్యూటీ డైరెక్టర్ లక్ష్మారెడ్డి

సుభాష్‌నగర్: వృత్తి విద్యా కోర్సులు జీవితంలో త్వరగా స్థిర పడేందుకు దోహద పడతాయని డిప్యూటీ డైరెక్టర్ లక్ష్మారెడ్డి అన్నారు. బహదూర్‌పల్లిలోని కేఎం పాండు ప్రభుత్వ ఒకేషనల్ జూనియర్ కళాశాలలో మంగళవారం వృత్తి విద్యా కోర్సులు, ఓజేటీ అప్రెంటిస్‌పై కళాశాల ప్రిన్సిపాల్ షేక్ మైమున్ అధ్యక్షతన అవగాహన సదస్సు జరిగింది. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా డిప్యూటీ డైరెక్టర్ లక్ష్మారెడ్డి, డీఈఈఓ కిషన్ హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. వృత్తి విద్యా కోర్సులకు నేటి పోటీ ప్రపంచంలో ఎంతో డిమాండ్ ఉందన్నారు. ఈ కోర్సులు చేసిన విద్యార్థులకు జాబ్ ఆఫర్లతో పాటు బీటెక్, డిగ్రీలు పూర్తి చేసే అవకాశాలు మెండుగా ఉంటాయన్నారు. ఓజేటీ ద్వారా రెండు నెలల పాటు స్కిల్స్ ట్రెనింగ్ పొందితే పలు కంపెనీల్లో ఉద్యోగ అవకాశాలు పొందవచ్చన్నారు. కార్యక్రమంలో ఎస్‌ఐ వి.డాక్టర్ జ్యోత్స్నరాణి, ట్రెనింగ్ అధికారి సతీష్‌రెడ్డి, ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ నాగేందర్, సీనియర్ అధ్యాపకుడు ఉపేందర్, అధ్యాపక బృందం, విద్యార్థులు పాల్గొన్నారు.

అగ్ని ప్రమాదాల నివారణపై అవగాహన



మూసాపేట: అగ్ని ప్రమాదాన్ని చూసి కంగారు పడకుండా మంటలను అదుపు చేసి ప్రమాదాన్ని తగ్గించాలని కూకట్‌పల్లి అగ్నిమాపక అధికారి జగన్‌మోహన్ అన్నారు. మంగళవారం కూకట్‌పల్లిలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులకు అగ్ని ప్రమాదాలు, నివారణపై అవగాహన కల్పించారు. మాల్స్, సినిమా థియేటర్లలో, సూపర్ మార్కెట్‌లలో అకస్మాత్తుగా అగ్ని ప్రమాదం సంభవిస్తే ఎలా తప్పించుకోవాలి. ప్రమాదాన్ని ఎలా తగ్గించాలో డ్రిల్ చేసి చూపించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతి షాపు, మాల్స్, సూపర్ మార్కెట్‌లలో మంటలను ఆర్పేందుకు వినియోగించే సిలిండర్లు ఉంటాయని, వాటిని ఉపయోగించి మంటలను ఎలా అదుపు చేస్తారో చేసి చూపించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ బి. వెంకటయ్య, అగ్నిమాపక సిబ్బంది, కళాశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

గంజాయి విక్రయిస్తున్న వ్యక్తి అరెస్టు



మూసాపేట: గంజాయి విక్రయిస్తున్న వ్యక్తిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. ఈ ఘటన కూకట్‌పల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో మంగళవారం జరిగింది. పోలీసుల వివరాల ప్రకారం... విశాఖపట్నంకు చెందిన గూడెపు రాజు (51) మూడు సంవత్సరాల క్రితం భార్య చనిపోయింది. పిల్లలు ఉన్నప్పటికీ ఒంటరిగా ఉంటున్నాడు. కూకట్‌పల్లి ప్రభుత్వ జూనియర్ కళాశాల వద్ద ఉన్న బస్టాప్‌లో గంజాయి రవాణా చేస్తున్నాడని సమాచారం అందడంతో.. పోలీసులు అతడిని అదుపులోకి తీసుకొని విచారించారు. 2.3 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకొని న్యాయస్థానం ఎదుట హాజరు పరిచారు. ఇతని మీద గతంలో జీడిమెట్ల పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైందని, 8 నెలలు జైల్లో ఉండి మూడు నెలల క్రితమే విడుదల అయ్యాడని పోలీసులు తెలిపారు. విశాఖపట్నం నుంచి గంజాయిని తీసుకువచ్చి నగరంలో విక్రయించి వెళుతుంటాడని పోలీసులు తెలిపారు.

సర్వేకు సహకరించాలి

నిజాంపేట్: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న ఇంటింటి కుటుంబ సర్వేకు ప్రజలు సహకరించాలని నిజాంపేట్ మేయర్ కొలన్ నీలారెడ్డి కోరారు. మంగళవారం ఆమె మాట్లాడుతూ.. బుధవారం ఉదయం 9 గంటలకు 12వ డివిజన్ ఇందిరమ్మ కాలనీ ఫేజ్- 2లోని పంచముఖ ఆంజనేయస్వామి ఆలయం నుంచి కుటుంబ సర్వే ప్రారంభమవుతుందని, కార్పొరేటర్లు, కో ఆప్షన్ సభ్యులు, అధికారులు ఈ కార్యక్రమంలో పాల్గొనాలన్నారు.

గాంధీ విగ్రహం ధ్వంసం



నిజాంపేట్: మహాత్మా గాంధీ విగ్రహం ధ్వంసమైన ఘటన ప్రగతినగర్‌లో కలకలం రేపింది. ప్రగతినగర్‌లోని లేక్ వ్యూ కాలనీలో గుర్తు తెలియని వ్యక్తులు స్థానికంగా ఉన్న గాంధీ విగ్రహాన్ని ధ్వంసం చేశారు. మహాత్మా గాంధీ విగ్రహాన్ని ధ్వంసం చేసిన వారిని గుర్తించి కఠినంగా శిక్షించాలని, విగ్రహం వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు.

కుమారుడిపై బెంగతో తల్లి ఆత్మహత్య

బాలానగర్: కుమారుడు చదువుకోకుండా తిరగడం, మరో వైపు అప్పుల బాధతో ఓ తల్లి ఆత్మహత్యకు పాల్పడింది. ఈ ఘటన బాలానగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. సీఐ నరసింహరాజు వివరాల ప్రకారం.. రాజు కాలనీకి చెందిన పుష్పలత (39), ఉమామహేశ్వరరావు దంపతులకు ముగ్గురు పిల్లలు. రెండవ కుమారుడు చదవకుండా జులాయిగా తిరగడంతో మదన పడుతూ ఉండేది. దానికి తోడు అప్పుల బాధతో ఇంట్లో ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. మృతురాలి భర్త ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

యాజమాన్యం వైఖరితో కార్మికులకు అన్యాయం

కుత్బుల్లాపూర్: యాజమాన్యాల మొండి వైఖరితో కార్మికులకు తీరని అన్యాయం జరుగుతోందని ఐఎన్‌టీయూసీ నేత చింతల నాగరాజు అన్నారు. మంగళవారం జీడిమెట్ల పారిశ్రామిక వాడలోని థర్మోకేబుల్ కంపెనీలో యాజమాన్యంతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగ విరమణ వయస్సును 60 సంవత్సరాలకు పొడిగించినా థర్మోకేబుల్ పరిశ్రమ యాజమాన్యం మాత్రం 55 సంవత్సరాలకే పరిమితం చేసిందన్నారు. దీంతో కార్మికులు సంవత్సరాల సర్వీసను కోల్పోతున్నారని తెలిపారు. యాజమాన్యం మొండి వైఖరి విడకుంటే తెలంగాణ స్టేట్ కమిషనర్ దృష్టికి తీసుకువెళ్తామని, అవసరమైతే హైకోర్టును ఆశ్రయిస్తామని హెచ్చరించారు. సమావేశంలో పరిశ్రమ డైరెక్టర్ మనోహర్‌రెడ్డి, హెచ్‌ఆర్ రిష్ కుమార్, పరిశ్రమ జనరల్ సెక్రెటరీ వెంకట్ రెడ్డి, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.



యాజమాన్యంతో చర్చలు జరుపుతున్న కార్మిక నేత చింతల నాగరాజు

తరలిన కాంగ్రెస్ నాయకులు



కాంగ్రెస్ నేత కూన శ్రీనివాస్‌గౌడ్ ఆధ్వర్యంలో తరలి వెళ్తున్న కాంగ్రెస్ శ్రేణులు

నిజాంపేట్: కులగణన సమావేశానికి హాజరైన కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీకి స్వాగతం పలికేందుకు నిజాంపేట్ కార్పొరేషన్ నుండి పెద్ద సంఖ్యలో కాంగ్రెస్ శ్రేణులు తరలి వెళ్లారు. బాచుపల్లి నుంచి నియోజకవర్గ ఇన్‌చార్జి కొలన్ హన్మంతరెడ్డి ఆధ్వర్యంలో, అదే విధంగా నిజాంపేట్ నుంచి కొలన్ గోపాల్ రెడ్డి, కార్పొరేటర్లు చిట్ల దివాకర్, సురేష్‌రెడ్డిల ఆధ్వర్యంలో కార్యకర్తలు ర్యాలీగా తరలి వెళ్లారు.

కడుపునొప్పి తాళలేక గృహిణి ఆత్మహత్య

మూసాపేట: కడుపునొప్పితో బాధపడుతున్న ఒక మహిళ ఆత్మహత్యకు పాల్పడింది. ఈ ఘటన కూకట్‌పల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో మంగళవారం జరిగింది. పోలీసుల వివరాల ప్రకారం.. చిత్తూరు జిల్లా మదనపల్లికి చెందిన అశ్విని (24) భర్త వేణుగోపాల్‌తో కలిసి కూకట్‌పల్లిలోని దయార్‌గూడలో నివాసం ఉంటున్నది. భర్త సాఫ్ట్‌వేర్ ఉద్యోగి. ఆమె గృహిణి. వీరిద్దరు నాలుగు సంవత్సరాల క్రితం ప్రేమించి, పెద్దలను ఒప్పించి వివాహం చేసుకున్నారు. రెండున్నర సంవత్సరాల బాబు ఉన్నాడు. కడుపునొప్పి తట్టుకోలేక భర్త ఉద్యోగానికి వెళ్లిన వెంటనే ఫ్యాన్‌కు ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకుంది. మృతదేహాన్ని గాంధీ ఆసుపత్రికి తరలించారు. మృతురాలి తమ్ముడి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.



అశ్విని(ఫైల్)

డీఏ, పీఆర్‌సీ సహా పెండింగ్ బిల్లులు తక్షణమే చెల్లించాలి

సాక్షి,సిటీబ్యూరో: తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం(టీపీయూఎస్) రాష్ట్ర శాఖ పిలుపు మేరకు మంగళవారం పెండింగ్ డీఏలు, పీఆర్‌సీతో సహా పెండింగ్ బిల్లులు తక్షణమే చెల్లించాలని టీచర్లు ధర్మాగ్రహ దీక్ష నిర్వహించారు. దశలవారీగా టీచర్లు ఆందోళనా కార్యక్రమాలు నిర్వహిస్తోందని టీపీయూఎస్ మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా శాఖ పేర్కొంది. కలెక్టరేట్ వద్ద ఆందోళనా కార్యక్రమాన్ని చేపట్టిన టీచర్లు అనంతరం జిల్లా కలెక్టర్ గౌతమ్‌కు సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో టీపీయూఎస్ రాష్ట్ర కార్యదర్శి గడప నవీన్, జిల్లా అధ్యక్షుడు శ్రీధర్, ప్రధాన కార్యదర్శి రాజ్‌కుమార్, జిల్లా నేతలు రమాదేవి, సురేందర్, గోపాల్, రమేష్ రాథోడ్, వెంకటేష్, సంగమేశ్, శ్రీనివాస్, వెంకటరమణ పాల్గొన్నారు.



ఆసక్తి కలిగిన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలి

సాక్షి,సిటీబ్యూరో: జిల్లా విద్యాశాఖ అధికారి కార్యాలయంతో సహా ఘట్‌కేసర్ మండలంలోని ఎదులాబాద్ అర్బన్ రెసిడెన్షియల్ బాలుర పాఠశాలలో రెండు సబార్డినేట్, ఒక వాచ్‌మెన్ ఉద్యోగాలకు అర్హత, ఆసక్తి గల అభ్యర్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు జిల్లా విద్యాశాఖ అధికారి విజయకుమారి ఒక ప్రకటనలో కోరారు. ఉద్యోగులను కాంట్రాక్టు పద్ధతిలో నియమిస్తామని తెలిపారు. అభ్యర్థులు పదో తరగతిలో ఉత్తీర్ణులై ఉండాలని సూచించారు. అర్హత, ఆసక్తి కలిగిన అభ్యర్థులు ఈనెల 7వ తేదీ వరకు మేడ్చల్ కలెక్టరేట్‌లోని జిల్లా విద్యాశాఖ అధికారి కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలని కోరారు.

సుందరకాండ పారాయణం

మోతీనగర్: వాల్మీకి మహర్షి రచించిన సుందరకాండ పారాయణం విన్నా, చదివినా అది ఎంతో తృప్తి ఇస్తుందని బ్రహ్మశ్రీ చేముటూరి మురళీ కృష్ణ అన్నారు. మంగళవారం మోతీనగర్‌లోని శ్రీ శృంగేరి శారద శంకరమఠం ఆవరణలో పవిత్ర కార్తీక మాసం పురస్కరించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించి సుందరకాండ పారాయణాన్ని ఆయన ప్రారంభించారు. ఉదయం 9 నుంచి సాయంత్రం 7 గంటల వరకు సుందరకాండ పారాయణాన్ని ఆయన పఠించారు. అనంతరం నిర్వాహకులు మురళీ కృష్ణను సన్మానించారు.

సిబ్బంది పనితీరుతోనే ప్రత్యేక గుర్తింపు

జీడిమెట్ల: రాష్ట్రంలో ఉన్న అన్ని ఆర్టీసీ రీజియన్‌లలో సికింద్రాబాద్ రీజియన్ నెంబర్ వన్‌లో ఉండటానికి ఆయా డిపోల్లో పని చేసే సిబ్బందే కారణమని సికింద్రాబాద్ రీజియన్ మేనేజర్ ఖుష్రో షాఖాన్ అన్నారు. మంగళవారం సికింద్రాబాద్ రీజియన్ ప్రగతి చక్ర త్రైమాసిక పురస్కారాల కార్యక్రమాన్ని జీడిమెట్ల డిపో డీఎం ఆంజనేయులు ఆధ్వర్యంలో డిపోలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జీవితంలో క్రమశిక్షణ కలిగిన వ్యక్తి ప్రతి పనిలోనూ రాణిస్తారని అన్నారు. సంస్థలో ఉత్తమ పని తీరును కనబర్చిన డ్రైవర్లు, కండక్టర్లు, మెకానిక్‌లకు పండుగ వాతావరణంలో అవార్డులను అందజేయడం సంతోషంగా ఉందన్నారు. కార్యక్రమంలో సికింద్రాబాద్ డిప్యూటీ ఆర్‌ఎం మెయింటెనెన్స్ సురేష్ చౌహాన్, హకీంపేట్ డీఎం బహుబూతి, మేడ్చల్ డీఎం సుధాకర్, కంటోన్మెంట్ డీఎం సుధాకర్ రావు, ఉప్పల్ డీఎం శ్రీనివాస్, హెచ్‌సీయూ డీఎం మురళీధర్ రెడ్డి, కూకట్‌పల్లి డీఎం హరి, మియాపూర్ డీఎం వెంకటేష్, కుషాయిగూడ డీఎం మహేష్, రాణిగంజ్ డీఎం శ్రీధర్, చెంగిచర్ల డీఎం కవితతో పాటు వివిధ డిపోల సీఐలు, అసిస్టెంట్ మేనేజర్లు పాల్గొన్నారు.

ఆర్టీసీపై నమ్మకాన్ని కలిగించాలి

ప్రతి డ్రైవర్ రక్షణాత్మకమైన డ్రైవింగ్ చేసి ప్రజలకు ఆర్టీసీపై నమ్మకాన్ని కలిగించాలని కూకట్‌పల్లి డిప్యూటీ ఆర్‌ఎం మెయింటెనెన్స్ కవిత అన్నారు. 2024-25 ఆర్థిక సంవత్సరానికి 154 కొత్త బస్సులు పెరగగా.. ప్రమాదాల శాతం సగానికి సగంగా తగ్గిపోయిందని తెలిపారు.

23 మందికి ఉత్తమ అవార్డులు

సికింద్రాబాద్ రీజియన్‌లోని వివిధ డిపోల్లో పని చేస్తున్న 23 మంది డ్రైవర్లు, కండక్టర్లు, మెకానిక్‌లకు ఉత్తమ అవార్డులను అందజేశారు. అవార్డు తీసుకున్న వారిలో జీడిమెట్ల డిపోకు చెందిన ముగ్గురు డ్రైవర్లు, కండక్టర్, కుషాయిగూడకు డిపోకు చెందిన ఇద్దరు డ్రైవర్లు, హెచ్‌సీయూ డిపోకు చెందిన ఇద్దరు డ్రైవర్లు, ఇద్దరు కండక్టర్లు, కూకట్‌పల్లి డిపోకు చెందిన ఇద్దరు డ్రైవర్లు, ఇద్దరు కండక్టర్లు, హకీంపేట్ డిపోకు చెందిన ఇద్దరు డ్రైవర్లు, కంటోన్మెంట్ డిపోకు చెందిన ఇద్దరు కండక్టర్లు, ఉప్పల్ డిపోలో చేస్తున్న ఇద్దరు మెకానిల్‌లు, ఒక హెల్పర్‌కు అవార్డులు అందజేశారు.



ప్రగతిచక్ర అవార్డులు అందుకున్న డ్రైవర్లు, కండక్టర్లు, మెకానిక్‌లు



హాజరైన వివిధ డిపోల సిబ్బంది

చేతిరాతపై విద్యార్థులకు శిక్షణ



విద్యార్థులకు శిక్షణ ఇస్తున్న జితేందర్‌రెడ్డి

జగద్గిరిగుట్ట: చేతిరాతను మెరుగు పర్చుకుంటే ఉత్తమ ఫలితాలు సాధించవచ్చని జగద్గిరినగర్ హెచ్‌ఎం సుభాష్‌చంద్రబోస్ రెడ్డి అన్నారు. మంగళవారం జగద్గిరినగర్ జడ్పీహెచ్‌ఎస్‌లో జితేందర్ హ్యాండ్ రైటింగ్ అకాడమీ ఆధ్వర్యంలో పదో తరగతి విద్యార్థులకు చేతిరాతపై శిక్షణా తరగతులు నిర్వహించారు. ఈ శిక్షణలో భాగంగా వారం రోజుల పాటు 56 మంది విద్యార్థులకు తమ చేతిరాతను మెరుగు పర్చుకునే విధంగా శిక్షణ ఇవ్వనున్నారు. ఈ శిక్షణ తమ విద్యార్థులకు పరీక్షల్లో ఎంతగానో ఉపకరిస్తుందని హెచ్‌ఎం పేర్కొన్నారు.

ఆటో డ్రైవర్లను ఆదుకోవాలి



మాట్లాడుతున్న బ్లూ ఇండియా పార్టీ వైస్ ప్రెసిడెంట్ అమీనుద్దీన్

నిజాంపేట్: మహిళలకు ఉచిత బస్సు సదుపాయంతో ఆటో డ్రైవర్లు జీవనోపాధిని కోల్పోయారని, వారిని రాష్ట్ర ప్రభుత్వం ఆదుకోవాలని బ్లూ ఇండియా పార్టీ వైస్ ప్రెసిడెంట్ అమీనుద్దీన్ డిమాండ్ చేశారు. బుధవారం బాచుపల్లిలోని పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆటో డ్రైవర్ల జీవితాలతో చెలగాటమాడటం సరికాదన్నారు. ఆటో డైవర్లకు నెలకు రూ.20 వేలు చెల్లించేలా రాష్ట్ర ప్రభుత్వంపై బ్లూ ఇండియా పార్టీ ఒత్తిడి తీసుకువస్తుందన్నారు.

కబడ్డీ అసోసియేషన్ అధ్యక్షుడికి సన్మానం



నిజాంపేట్: తెలంగాణ కబడ్డీ అసోసియేషన్ అధ్యక్షుడిగా నియమితులైన కాసాని వీరేష్‌ముదిరాజ్‌కు అభినందలు వెల్లువెత్తాయి. వనపర్తి జిల్లా కబడ్డీ జట్టు అధ్యక్షురాలు పద్మజారెడ్డి ఆధ్వర్యంలో టీమ్ సభ్యులు బాచుపల్లిలోని కార్యాలయంలో ఆయనను కలిసి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.

7 నుంచి మనూలో 'ఆజాద్ డే'

రాయదుర్గం: మౌలానా ఆజాద్ జాతీయ ఉర్దూ విశ్వవిద్యాలయంలో ఆజాద్ డే -2024 నిర్వహణకు భారీ ఏర్పాట్లు చేస్తున్నారు. ఆజాద్ జయంతిని పురస్కరించుకొని మనూ మోడల్ స్కూల్‌లో నవంబర్ 7 నుంచి 11వ తేదీ వరకు వేడుకలు నిర్వహించాలని నిర్ణయించారు. వేడుకల్లో భాగంగా ఫిల్మ్ స్క్రీనింగ్, బుక్ రిలీజ్, స్టోరీ టెల్లింగ్, ఐటీ ఎక్స్‌పో, డిబేట్, బుక్ అండ్ ఫొటో ఎగ్జిబిషన్, ప్యానెల్ డిస్కషన్, ఓపెన్ మైక్ కాలిగ్రఫీ, సాంస్కృతిక కార్యక్రమాలు, ఫుడ్‌ఫెస్ట్, ముషాయిరా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు.

11న ఆజాద్ డే మెమోరియల్ లెక్చర్

ఆజాద్ డే వేడుకల్లో భాగంగా నవంబర్ 11న జాతీయ విద్యా దినోత్సవాన్ని పురస్కరించుకొని ఆజాద్ డే మెమోరియల్ లెక్చర్ కార్యక్రమాన్ని ఏర్పాటుచేశారు.

బీసీ కమిషన్ పర్యటన వాయిదా

బీసీ అభివృద్ధి శాఖ జిల్లా అధికారి ఇందిర

సాక్షి,సిటీబ్యూరో: ఈనెల 7న రంగారెడ్డి జిల్లా కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించ తలపెట్టిన తెలంగాణ బీసీ కమిషన్ పర్యటన వాయిదా పడినట్లు మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి అధికారి ఆర్.ఇందిర ఒక ప్రకటనలో తెలిపారు. మేడ్చల్ జిల్లాలోని ప్రజాప్రతినిధులు, బీసీ సంఘాలు, సంచార జాతులు, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ సామాజికవర్గాల నాయకులు ఈ విషయాన్ని గమనించాలని ఆమె కోరారు. బీసీ కమిషన్ తదుపరి పర్యటన వివరాలను త్వరలో ప్రకటిస్తామని పేర్కొన్నారు.

టిప్పర్ ఢీకొని వ్యక్తి మృతి

జగద్గిరిగుట్ట: ఓ వ్యక్తిని టిప్పర్ ఢీ కొట్టడంతో మృతి చెందాడు. ఈ ఘటన జగద్గిరిగుట్ట పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసుల వివరాల ప్రకారం.. శ్రీరామ్‌నగర్‌కు చెందిన బాయికాడి పండరి(43) భవన నిర్మాణ కార్మికుడు. మంగళవారం మద్యం సేవించి రోడా మేస్త్రీ నగర్‌లో పడిపోయాడు. దీంతో అతనికి తెలిసిన వారు పండరిని ఇంటి వద్ద వదలిపెట్టి వెళ్లారు. కొద్ది సేపటి తరువాత పండరి సమీపంలోని హెచ్‌ఎంటీ ఖాళీ స్థలంలోకి వెళ్లారు. ఈ క్రమంలో చెత్త పారబోసేందుకు వచ్చిన టిప్పర్ పండరిని ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో టిప్పర్ చక్రాలు అతడిపై నుంచి వెళ్లడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం అందుకున్న పోలీసులు మృతదేహాన్ని గాంధీ ఆసుపత్రికి తరలించారు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

వ్యభిచార గృహంపై పోలీసుల దాడి

మూసాపేట: వ్యభిచార గృహంపై దాడి చేసి నిర్వాహకురాలిని, విటుడిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరించారు. ఈ ఘటన కూకట్‌పల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో మంగళవారం జరిగింది. పోలీసుల వివరాల ప్రకారం.. కూకట్‌పల్లి బాలాజీనగర్ ఎంఐజీలోని ఓ ఇంటిలో ఇద్దరు వ్యక్తులు అమ్మాయిలను తీసుకువచ్చి వ్యభిచారం నిర్వహిస్తున్నారు. విశ్వసనీయ సమాచారం మేరకు పోలీసులు ఇంటిపై దాడి చేసి నిర్వాహకురాలిని, విటుడు సుబ్రహ్మణ్యం, ఓ అమ్మాయి (25)ని అదుపులోకి తీసుకున్నారు. మరో నిర్వాహకుడు పరారీలో ఉన్నట్లు పోలీసులు తెలిపారు. నిర్వాహకురాలిని, విటుడుని రిమాండ్‌కు తరలించి, అమ్మాయిని రెస్క్యూ హోంకు తరలించామని పోలీసులు తెలిపారు.